

వరంగల్ రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్ గట్టు రామచందర్‌రావు తదితరులు

# కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు పెట్టాలి

- 42% రిజర్వేషన్లు కల్పించాలి
- పూర్తిస్థాయిలో అమలుకు బీసీ మేధావులు గళమెత్తాలి
- పూలే విగ్రహంపై ఏప్రిల్ 11లోగా ప్రకటన చేయాలి
- వరంగల్, కరీంనగర్ రౌండ్‌టేబుల్ సమావేశాల్లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

వరంగల్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/కమాన్‌చౌరస్తా: రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన మేరకు ఆరు నెలల్లో కులగణన చేపట్టడానికి తక్షణమే ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. ఆగమాగంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనుకుంటే ఊరుకోబోమని హెచ్చరించారు. బీసీ హక్కుల సాధన కోసం భారత జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్తంగా మంగళవారం వరంగల్, కరీంనగర్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కులగణనపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీల సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయించాలని, బీసీ సబ్ ప్లాన్‌కి చట్టబద్ధత కల్పించాలని కోరారు. ఎంబీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహ ఏర్పాటుకు సంబంధించి ఏప్రిల్ 11లోపు ప్రభుత్వం సానుకూల ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఏ రాష్ట్రంలోని జనాభాకు అనుగుణంగా ఆ రాష్ట్ర ప్రభుత్వమే రిజర్వేషన్లు ఇచ్చుకునే సౌలభ్యం కల్పించాలని కేసీఆర్ ప్రతిపాదించారని, కేంద్రం మాత్రం ఆ అవకాశాన్ని రాష్ట్రాలకు ఇవ్వడం లేదని మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు కోటా కల్పించాలని డిమాండ్ చేశారు. 2018 నుంచి ఇప్పటివరకు 4,365 మంది సివిల్స్‌కు ఎంపికయ్యారని, వీరిలో 1,195 మంది మాత్రమే బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఉన్నారని పేర్కొన్నారు. ఓబీసీలకు 27% రిజర్వేషన్లు ఉన్నా ఈ వర్గాల నుంచి 15.5% మందినే ఎంపిక చేశారని చెప్పారు. ఎస్సీలు 5%, ఎస్టీలు 3 శాతమే ఎంపికయ్యారని వివరించారు. ఆయా వర్గాలు కోల్పోతున్న రిజర్వేషన్లపై బీసీ మేధావులు గళమెత్తాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, బీఆర్‌ఎస్ నాయకులు వీ ప్రకాశ్, సుందర్‌రాజుయాదవ్, యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్ గట్టు రామచందర్‌రావు, భారత జాగృతి రాష్ట్ర నాయకుడు దాస్యం విజయ్‌భాస్కర్, నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రాడ్ కంపెనీకి మూసీ ప్రాజెక్టు?


మొదటిపేజీ తరువాయి...

ఆ కంపెనీ చేతులెత్తేయటం.. అమరావతి పరిస్థితి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలిపోవడమూ మనకు అనుభవమే.

### పాక్ వదిలి పారిపోయిన మెయిన్‌హార్ట్

హైదరాబాద్‌లో మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు చేపట్టేందుకు ముందుకొచ్చిన మెయిన్‌హార్ట్ సంస్థకు పాకిస్థాన్‌లో ఎంతో ఘనమైన నేరచరిత్ర ఉన్నది. ఆ కంపెనీ చేసిన మోసాలు ఇంటర్నెట్‌లో పుంఖానుపుంఖాలుగా లభ్యమవుతున్నాయి. ఈ కంపెనీ పాక్ ప్రభుత్వాన్ని, ప్రజలను వేల కోట్ల రూపాయల మేర మోసం చేసింది. దీంతో కంపెనీ యజమాని నసీం షెహజాద్, ఆయన కొడుకు, కంపెనీ సీఈవో ఒమర్ షెహజాద్‌పై అనేక కేసులు నమోదయ్యాయి. ఓ రెసిడెన్షియల్ ప్రాజెక్టులో స్థానిక ప్రైవేటు బ్యాంకుతో కలిసి వేల కోట్ల రూపాయల మేర ఇండ్ల కొనుగోలుదారులను మోసం చేసినట్టు ఓ కేసు నమోదైంది. మెయిన్‌హార్ట్ సంస్థ 300 కోట్ల మేర హవాలా కుంభకోణానికి పాల్పడినట్టు మరో అభియోగం నమోదైంది. క్రీక్ మెరీనా ప్రాజెక్టు పేరిట పాకిస్థాన్‌లోని మరో ప్రాంతంలో ఇండ్ల కొనుగోలుదారుల నుంచి అడ్వాన్స్‌లు, ఈఎంఐల పేరిట వేల కోట్ల రూపాయలు వసూలు చేసి చేతులెత్తేసినట్టు మరో కేసు ఉన్నది. ఈ కేసులో ఇద్దరు బ్యాంకర్లు కూడా నిందితులుగా ఉన్నారు. నసీం షెహజాద్, ఒమర్ షెహజాద్‌లు దేశం విడిచి పారిపోయిన నేరగాళ్లుగా పాక్ ప్రభుత్వం గత నవంబర్‌లో ప్రకటించింది. వీరు పాకిస్థాన్‌లో తమ కార్యకలాపాలను నిలిపివేశారు. అక్కడి ప్రభుత్వం వీరిపై కఠిన చర్యలకు ఉపక్రమించింది.




మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు చేపట్టేందుకు ముందుకొచ్చిన మెయిన్‌హార్ట్ సంస్థ మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ఇంటర్నెట్‌లో ఉన్న సమాచారం (పక్క ఫొటో), నసీం షెహజాద్, ఒమర్ షెహజాద్‌లు దేశం విడిచి పారిపోయిన నేరగాళ్లుగా పాక్ ప్రభుత్వ ప్రకటన

### మెయిన్‌హార్ట్ నుంచి నమూనాలు కోరిన సీఎం

మెయిన్‌హార్ట్ ప్రతినిధులు హైదరాబాద్ వచ్చారని తెలియగానే.. ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గాంధీభవన్‌లో కార్యక్రమాన్ని హడావుడిగా ముగించుకొని వచ్చి సచివాలయంలో వారితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నమూనాలు రూపొందించాలని సీఎం ఆ కంపెనీ ప్రతినిధులకు సూచించారు. అవుటర్ రింగ్‌రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు, నగరం చుట్టూ ఏర్పాటయ్యే రైలు మార్గాల విస్తరణతో రాబోయే రోజుల్లో హైదరాబాద్ రూపురేఖలు మారిపోతాయని చెప్పారు. వాటికి అనుగుణంగా మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ నమూనాలను రూపొందించాలని సూచించారు. ఒకవేళ ఆ కంపెనీ రూపొందించే నమూనాలు ప్రభుత్వ పెద్దలకు నచ్చితే మూసీ ప్రాజెక్టును ఆ సంస్థకు అప్పగించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

పొరుగుదేశంలో ఎన్నో మోసాలు, కుంభకోణాలకు పాల్పడిన సంస్థ గురించి తెలుసుకోకుండానే అధికారులు, ప్రభుత్వ పెద్దలు దానిని హైదరాబాద్‌కు ఆహ్వానించారా? లేక పాకిస్థాన్‌లో జరిగిన మోసాలను ఇక్కడా అనుమతించి.. ప్రజా ధనాన్ని కొల్లగొట్టి వాటాలను పంచుకోవాలన్న ఉద్దేశం ఏమైనా ఉన్నదా? అంటూ పరిశీలకులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. మెయిన్‌హార్ట్ సంస్థ ప్రతినిధులతో భేటీ అయిన వారిలో ముఖ్యమంత్రితోపాటు సీఎస్ శాంతికుమారి, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్, మూసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఆమ్రపాలి ఉన్నారు.




సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ విజయ్ కుమార్

# అంతర్జాతీయ డ్రగ్స్ కింగ్‌పిన్ స్టాన్లీ అరెస్ట్

- దేశవ్యాప్తంగా 500 మంది వినియోగదారులు
- రూ.8 కోట్ల విలువైన మత్తు పదార్థాల స్వాధీనం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 6: అంతర్జాతీయ డ్రగ్స్ కింగ్‌పిన్ స్టాన్లీ పోలీసులకు చిక్కాడు. గోవా కేంద్రంగా దేశ, విదేశాల్లో డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్న ఇవూలా ఉకోడా స్టాన్లీ (43)ని పంజాగుట్ట పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి భారీగా మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో వెస్ట్ జోన్ డీసీపీ విజయ్‌కుమార్ మీడియాకు వివరాలు వెల్లడించారు. నైజీరియాకు చెందిన స్టాన్లీ 2009లో బిజినెస్ వీసాపై భారత్‌కు వచ్చాడు. ముంబైలో రెడీమేడ్ దుస్తుల వ్యాపారాన్ని ప్రారంభించాడు. ఏడాది తర్వాత గోవాలోని కండోలిమ్‌కు చేరుకుని మత్తు పదార్థాలను తెప్పించి పర్యాటకులకు విక్రయించడం మొదలు పెట్టాడు. 15 ఏండ్లుగా డ్రగ్స్ దందాను విస్తరించుకుంటూ వచ్చాడు. ప్రస్తుతం అతడి వద్ద దేశ వ్యాప్తంగా 500 మంది డ్రగ్స్ కొనుగోలు చేస్తుండగా, ఏడుగురు హైదరాబాద్‌కు చెందిన వారున్నారు. నిరుడు స్టాన్లీ డ్రగ్స్ దందాతో సంబంధం ఉన్న హనుమంత్ బాబుసో దివాకర్ అలియాస్ బాబా, అలియాస్ బాబును ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో టీఎన్యాబ్ బృందం అరెస్టు చేసింది. అతడి ద్వారా ఆరా తీయగా, స్టాన్లీ గుట్టు రట్టయ్యింది. నిందితుడి వద్ద రూ.8 కోట్ల విలువైన మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు వెల్లడించారు. 557 గ్రాముల కొకైన్, 309 గ్రాముల 902 ఎక్స్‌టాసి పిల్స్, 105 ఎల్‌ఎస్‌డీ బ్లాట్స్, 215 గ్రాముల చరస్, 21 గ్రాముల హెరాయిన్, ఏడు గ్రాముల అంపెథమైన్, 45 గ్రాముల ఓజీ, 190 గ్రాముల వీడ్, ఎనిమిది సెల్‌ఫోన్లు, రూ.5.40 లక్షల నగదు ఉన్నాయి.

# జనగణనలోనే కులగణన చేపట్టాలి

- ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నాలో ఎంపీ ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): జనగణనలో భాగంగా కులగణన చేయాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మంగళవారం జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. దేశ జనాభాలో 75 కోట్ల మంది బీసీలుంటే, వారికోసం ప్రత్యేక మంత్రి త్వ శాఖ లేదని, ఇప్పటికైనా ఏర్పాటు చేయాలని కోరా రు. కేంద్ర ప్రభుత్వంలో 54 లక్షల మంది ఉద్యోగులుం టే, అందులో 7.5 లక్షల మంది మాత్రమే బీసీ ఉద్యోగులు ఉన్నారని, దీన్నిబట్టి 14 శాతం ప్రాతినిధ్యం మాత్రమే ఉన్నదని తెలిపారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని, కేంద్ర ఉద్యోగుల ప్రమోషన్లలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్లపై 34 రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి జులైలో జరిగే పార్లమెంటు సమావేశాల్లో విస్తృతంగా చర్చించాలని, ప్రభుత్వం దిగిరాకపోతే ఆ సమావేశాలను బహిష్కరించాలని కోరారు.

# యాసంగి 'సాగు'తలేదు!

- 7 లక్షల ఎకరాల్లో తగ్గిన సాగు
- 5.71 లక్షల ఎకరాల్లో నాట్లు బంద్
- సాగర్ కింద సాగునీళ్లు కరువు
- సాగైన పంటలు చేతికి రావడం అనుమానమే!

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): యాసంగి సాగులో మళ్లీ పాత కరువు రోజులు వస్తున్నట్టు కనిపిస్తున్నది. కొన్నేండ్లుగా క్రమంగా వానకాలంతో పోటీపడుతూ పెరుగుతూ వస్తున్న యాసంగి సాగు ఈ ఏడాది తగ్గుముఖం పడుతున్నది. వ్యవసాయశాఖ అధికారిక లెక్కల ప్రకారం నిరుడు ఇదే సమయానికి గల యాసంగి సాగుతో పోల్చితే ఈ ఏడాది 7 లక్షల ఎకరాల్లో పంట సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. నిరుడు ఇదే సమయానికి 60 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవ్వగా, ప్రస్తుతం ఇది 53 లక్షల ఎకరాలకే పరిమితమైంది. నిరుడు యాసంగిలో రికార్డుస్థాయిలో 72.63 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అంటే గత యాసంగి సాగును చేరేందుకు ప్రస్తుతం ఇంకా 20 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కావాల్సిన అవసరం ఉన్నది.

### పంటలు చేతికొచ్చేనా?

ప్రస్తుతం గత సీజన్‌లో కేసీఆర్ ప్రభుత్వం విడుదల చేసిన నీళ్లు ఆయా చెరువుల్లో, ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్నాయి. దీంతో రైతులు ఇప్పుడు ఆ మాత్రం పంటలు సాగు చేయగలుగుతున్నారు. అయితే ఇది రైతులకు తాత్కాలిక ఉపశమనమే అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పంటలు చేతికి దక్కాలంటే రెండు నెలలపాటు సాగు నీళ్లు అందించాల్సిన అవసరం ఉన్నది. ప్రస్తుత ప్రభుత్వం ఆయా ప్రాజెక్టుల కింద సాగు నీళ్లు అందించడం లేదు. ఈ నేపథ్యంలో పంటల చివరి దశలో నీళ్లు అందడం కష్టమేనని అధికార వర్గాల్లో చర్చ నడుస్తున్నది. ఇదే జరిగితే పంటలు చేతికొచ్చే సమయంలో ఎండిపోతాయోమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నీళ్లు అందుబాటులో ఉండటంతో ఊరుకోలేక పంటలు సాగు చేసుకొన్నామని, ఈ పంటలకు చివరిదాక నీళ్లు అందుతాయో? లేదో? పంటలు చేతికొస్తాయో? లేదో? అని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### చాలాచోట్ల వరినాట్లు బంద్

యాసంగిలో సాగునీళ్ల కొరత ప్రభావం వరిసాగుపై భారీగా పడింది. నాగార్జునసాగర్ తోపాటు కడెం, ఎస్సారెస్పీ, నిజాంసాగర్, కాళేశ్వరం అనుసంధాన ప్రాజెక్టుల నుంచి అవసరమైన సాగునీళ్లు అందుబాటులో లేకపోవడంతో వరిసాగు భారీగా తగ్గింది. గతంతో పోల్చితే మొత్తం సాగు 7 లక్షల ఎకరాల్లో తగ్గితే అందులో వరి సాగే ఏకంగా 6 లక్షల ఎకరాల్లో తగ్గడం గమనార్హం. సాగర్ నీళ్లు ఇవ్వలేమని కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేయడంతో ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో పంటల సాగుపై తీవ్ర ప్రభావం పడింది. మొండిపట్టుదలకు పోయి కాళేశ్వరం ద్వారా నీళ్ల పంపిణీని మొత్తం బంద్ చేసింది. ఈ ప్రభావం రాష్ట్రంలోని సుమారు 13 జిల్లాల సాగుపై పడింది. దీంతోపాటు కడెం, ఎస్సారెస్పీ, నిజాంసాగర్ ప్రాజెక్టుల నుంచి నీళ్లు ఇవ్వకపోవడంతో పంటల సాగు అయోమయంలో పడిపోయింది.

### ఐ అండ్ బీ మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా సంజయ్ జాజు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు ఢిల్లీలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన తెలంగాణ క్యాడర్‌కు చెందిన 1992-బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆయన బాధ్యతలు స్వీకరించిన తర్వాత మాజీ కార్యదర్శి అపూర్వ చంద్ర, మంత్రిత్వ శాఖ, వివిధ మీడియా విభాగాల ఇతర అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అంతకు ముందు అంటే 2018 నుంచి 2023 వరకు జాజు భారత ప్రభుత్వ అదనపు కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. జాతీయ రహదారుల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా 2014 నుంచి 2018 వరకు ఆయన పనిచేశారు.

# 500కే గ్యాస్ అమలుకు మూడు ప్రతిపాదనలు!

- అమలు విధివిధానాల తయారీపై సివిల్‌సప్లై కసరత్తు
- గ్యాస్ కంపెనీల ప్రతినిధులతో అధికారుల సమావేశం
- సబ్సిడీ కంపెనీలకా? డిస్ట్రిబ్యూటర్లకా? కస్టమర్లకా?
- ఈ మూడు ప్రతిపాదనలపై సమాలోచనలు
- వినియోగదారుల డాటా ఇచ్చేందుకు కంపెనీలు నో



హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): ఆరు గ్యారెంటీల్లో భాగంగా రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో విధివిధానాల రూపకల్పనపై పౌరసరఫరాల శాఖ కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగానే ఆ శాఖ ఉన్నతాధికారులు ఆయా గ్యాస్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పథకాన్ని ఏ విధంగా అమలు చేయాలన్న అంశంపై చర్చించారు. అమలులో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కారాలపై చర్చించినట్టు తెలిసింది. చర్చల అనంతరం ప్రధానంగా 3 ప్రతిపాదనలను సిద్ధం చేసినట్టు సమాచారం. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందించి ప్రభుత్వ ఆదేశాల మేరకు అమలు చేయనున్నారు. ఈ నెల 8 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతుండటంతో అనంతరం దీనిపై ఓ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉన్నదని తెలిసింది.

### 64 లక్షల కుటుంబాలకే అర్హత!

*500కే గ్యాస్ సిలిండర్ అమలు కోసం తెల్ల రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకుంటున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 90 లక్షల తెల్ల రేషన్‌కార్డులున్నాయి. సుమారు 1.24 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. 90 లక్షల తెల్ల రేషన్‌కార్డుల్లో సుమారు 64 లక్షల కార్డులకు మాత్రమే గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్టు పౌరసరఫరాల శాఖ గుర్తించింది. మిగిలిన సుమారు 26 లక్షల కార్డులకు గ్యాస్ కనెక్షన్ లేదు. ఈ లెక్కన 64 లక్షల కార్డుదారులకు మాత్రమే 500కు గ్యాస్ కనెక్షన్ వర్తించే అవకాశం ఉన్నది. 64 లక్షల కార్డులకు రూ.1,747 కోట్ల ఆర్థిక భారం మాత్రమే ప్రభుత్వంపై పడనున్నది.*

### మూడు ప్రతిపాదనలు సిద్ధం

రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం అమలుకు సంబంధించి అధికారులు మూడు ప్రతిపాదనలను తయారు చేసినట్టు తెలిసింది. ప్రస్తుతం ఒక్కో గ్యాస్ సిలిండర్ ధర రూ.955గా ఉన్నది. ఈ పథకంలో భాగంగా రూ.500 వినియోగదారుడు భరిస్తుండగా మిగిలిన రూ.455 సబ్సిడీని ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. ఈ సబ్సిడీ మొత్తాన్ని ఎవరికి అందించాలనే అంశంపై మూడు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు తెలిసింది. ఇందులో ఒకటి గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లకు ఇవ్వాలని, మరొకటి గ్యాస్ కంపెనీలకే ఇవ్వాలని ప్రతిపాదించగా మూడోది వినియోగదారులకే నేరుగా ఇవ్వాలని ప్రతిపాదించినట్టు సమాచారం. రాజస్థాన్ మాదిరిగా ఇక్కడ కూడా డిస్ట్రిబ్యూటర్లు, కంపెనీలు సబ్సిడీ అమౌంట్‌ను తీసుకొనేందుకు అంగీకరించకపోవచ్చని తెలిసింది. ఇప్పటికే ఈ విషయాన్ని ఇటీవల జరిగిన సమావేశంలో కంపెనీల ప్రతినిధులు, సివిల్ సప్లై అధికారులు వెల్లడించినట్టు సమాచారం. మరోవైపు రాష్ట్రంలో ఎన్ని గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి? వారిలో ఎంత మంది రేషన్‌కార్డు కలిగి ఉన్నారు? వినియోగదారులవారీగా వివరాలను అందించాల్సిందిగా గ్యాస్ కంపెనీలను పౌరసరఫరాల అధికారులు కోరగా ఇందుకు వారు నిరాకరించినట్టు తెలిసింది. కేంద్రం నుంచి అనుమతి తీసుకోవాలని, అప్పుడే సమాచారాన్ని అందించగలమని చెప్పినట్టు తెలిసింది.

# ఎస్సీల వర్గీకరణపై 'సుప్రీం'లో విచారణ

- పంజాబ్ పిటిషన్‌ను ప్రధాన పిటిషన్‌గా పరిగణించిన రాజ్యాంగ ధర్మాసనం
- విచారణకు మంత్రి రాజ నరసింహ, కృష్ణమాదిగ హాజరు

*హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): షెడ్యూల్డు కులాల వర్గీకరణపై సుప్రీం కోర్టులో మంగళవారం విచారణ ప్రారంభమైంది. ఈ వర్గీకరణపై పంజాబ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన పిటిషన్‌గా పరిగణించి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేపట్టింది. దీంతో పంజాబ్ ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ వాదనలు ప్రారంభించారు. తెలంగాణ మంత్రి దామోదర్ రాజనరసింహ, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ విచారణకు హాజరయ్యారు. మంద కృష్ణమాదిగ దాఖలు చేసిన పిటిషన్‌ను పంజాబ్ పిటిషన్‌కు జతచేసిన ధర్మాసనం.. వర్గీకరణకు రాష్ట్ర శాసనసభలు సిద్ధంగా ఉన్నాయా? రిజర్వేషన్లలో అసమానతలను తొలగించడానికి ప్రభుత్వాలు తీసుకున్న చర్యలేమిటి? అని ప్రశ్నించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం చేసిన ఎస్సీల వర్గీకరణను 2004లో సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. రిజర్వేషన్ల మంజూరు కోసం ఎస్సీ, ఎస్టీలను వర్గీకరించే అధికారం రాష్ట్రాలకు లేదని అప్పట్లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ తీర్పు చెల్లుబాటును పరిశీలిస్తామని తాజాగా రాజ్యాంగ ధర్మాసనం వెల్లడించింది.*

### సానుకూల తీర్పుపై ఆశలు: దామోదర



*ఎస్సీలకు సామాజిక న్యాయం దక్కాలంటే వర్గీకరణ జరగాలని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఈ వర్గీకరణకు సుప్రీంకోర్టు నుంచి సానుకూల తీర్పు వస్తుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఎస్సీల వర్గీకరణపై విచారణలో తెలంగాణ ప్రభుత్వం కూడా భాగమైనందునే సుప్రీంకోర్టుకు వచ్చానని, ఈ విచారణకు తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది వివేక్ ధన్కాను రాష్ట్ర ప్రభుత్వం నియమించిందని చెప్పారు.*

# విద్యార్థినుల మృతి కేసులో వార్డెన్‌పై వేటు

- విచారణాధికారి నియామకం
- పోలీసుల అదుపులో ఆటో డ్రైవర్, వంట మనిషి!
- దోషులను కఠినంగా శిక్షించాలి: ఎమ్మెల్సీ కవిత డిమాండ్



ఎస్సీ వసతి గృహాన్ని సందర్శిస్తున్న మహిళా శిశు సంక్షేమశాఖ జేడీ లక్ష్మీదేవి

యాదాద్రి భువనగిరి/హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లాలో పదోతరగతి విద్యార్థినుల మృతి కేసులో ప్రభుత్వం ఎట్టకేలకు దిగివచ్చింది. హాస్టల్ వార్డెన్ శైలజను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ హన్మంతు కే జెండగే మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విపక్షాల ఆందోళనలతో నేపథ్యంలో స్పందించిన సర్కారు ఘటనపై ఉన్నతస్థాయి విచారణ కోసం మహిళా శిశు సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ (స్కీమ్స్) కేఆర్‌ఎస్ లక్ష్మీదేవిని విచారణాధికారిగా నియమించింది. ఈ నెల 3న రాత్రి భువనగిరి పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో భవ్య, వైష్ణవి అనే పదోతరగతి విద్యార్థులు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో ఆటో డ్రైవర్ ఆంజనేయులు, హాస్టల్ వంట మనిషిని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. ఓ వైపు పోలీసులు దర్యాప్తు చేపడుతుండగా, మహిళా శిశు సంక్షేమశాఖ జేడీ లక్ష్మీదేవి మంగళవారం వసతి గృహాన్ని సందర్శించి ఘటనపై ఆరా తీశారు. విద్యార్థినుల ఆత్మహత్యపై ఆలస్యంగానైనా తమ డిమాండ్‌కు స్పందించి దర్యాప్తునకు విచారణ అధికారిని నియమించినందుకు ఎమ్మెల్సీ కవిత 'ఎక్స్' వేదికగా ధన్యవాదాలు తెలియజేశారు. నిష్పక్షపాతంగా, లోతుగా విచారణ జరిపించి కాలయాపన చేయకుండా దోషులను త్వరగా గుర్తించి కఠినంగా శిక్షించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భువనగిరి ఎస్సీ బాలికల హాస్టల్‌ను ఎమ్మెల్సీ కవిత మంగళవారం ఉదయం సందర్శించారు.

# శివబాలకృష్ణ తమ్ముడు అరెస్టు

- నేటితో ముగియనున్న బాలకృష్ణ కస్టడీ

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అక్రమాస్తుల కేసులో మంగళవారం కీలక పరిణామం చోటుచేసుకున్నది. బాలకృష్ణ తమ్ముడు శివ నవీన్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. మూడు రోజులపాటు అతడిని విచారించిన అధికారులు.. బాలకృష్ణకు బినామీగా ఉండి నవీన్ భారీగా ఆస్తులు కూడబెట్టినట్టు గుర్తించారు. మరోవైపు శివబాలకృష్ణ కస్టడీ బుధవారంతో ముగియనున్నది. కొన్ని విషయాల్లో ఆయన కీలక సమాచారం దాస్తున్నారనే అనుమానంతో ఏసీబీ మరో ఐదురోజుల కస్టడీ కోరనున్నది. విచారణ ముగిసిన వెంటనే మరో ఐదు రోజుల కస్టడీపై కోర్టులో పిటిషన్ వేయనున్నది. ఏడు రోజుల విచారణలో శివ బాలకృష్ణ నుంచి పలు కీలక అంశాలు రాబట్టినట్టు తెలిసింది. ఆదిత్య, ఫినిక్స్ రియల్ ఎస్టేట్ కంపెనీలకు చెందిన పలువురు ప్రతినిధులను ఏసీబీ అధికారులు మరోమారు విచారించి కీలక విషయాలు రాబట్టారు. తమ విచారణలో శివబాలకృష్ణ తమ్ముడు శివ నవీన్, మేల్లుడు భరత్ పేరిట భారీగా బినామీ ఆస్తులు ఉన్నట్టు గుర్తించారు. గత ఐదు రోజులుగా హెచ్‌ఎండీఏ ఆఫీసులోని 4,7 అంతస్థుల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. సుమారు 26 మందికిపైగా ఏసీబీ సిబ్బంది అన్ని ఫైళ్లకు సంబంధించిన అనుమతులు చెక్ చేస్తున్నారు.

# పెద్దపల్లి, పాలమూరు కాంగ్రెస్‌లో ముసలం

- వెంకటేశ్ నేత, మన్నె జీవన్‌రెడ్డి చేరికతో సెగ
- లోక్‌సభ సీట్లు ఆశిస్తున్న వంశీచంద్, వివేక్ వంశీ ఆశలపై నీళ్లు

*హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో తాజాగా ఇద్దరి చేరిక ఆ పార్టీలో చిచ్చు రేపింది. పెద్దపల్లి రిజర్వ్‌డ్ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్ నేత, మహబూబ్‌నగర్ టికెట్ ఆశిస్తూ పారిశ్రామికవేత్త మన్నె జీవన్‌రెడ్డి మంగళవారం ఉదయం ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో పెద్దపల్లి, మహబూబ్‌నగర్ నుంచి టికెట్ ఆశిస్తున్న పార్టీ నేతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం నుంచి చల్లా వంశీచంద్‌రెడ్డి, పెద్దపల్లి స్థానం నుంచి ఎమ్మెల్యే వివేక్ తనయుడు వంశీకృష్ణ టికెట్ ఆశిస్తున్నారు. తమకు టికెట్ గ్యారంటీ అన్న ధీమాతో వీరు ఇప్పటికే ఎన్నికల ప్రచారం కూడా మొదలుపెట్టారు.*

### వివేక్ వంశీ ఆశలపై నీళ్లు

చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ మంత్రివర్గంలో స్థానం కోసం తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఫలితం దక్కలేదు. దీంతో కనీసం తన కుమారుడు వంశీకృష్ణకు పెద్దపల్లి నుంచి ఎంపీ టికెట్ ఇవ్వాలని కోరగా పార్టీ పెద్దలు సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది. అయితే వివేక్ ఆశలపై నీళ్లు చల్లుతూ ఎంపీ వెంకటేశ్ నేతను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది.

### వంశీకి రాజ్యసభ సీటు?

*మన్నె జీవన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరబోతున్నారన్న సమాచారంతో మూడు రోజుల కిందట వంశీచంద్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తన రాజకీయ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేసినట్టు సమాచారం. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని రెండు లోక్‌సభ నియోజకవర్గాల ఎన్నికల వ్యయాన్ని మోయడానికి జీవన్‌రెడ్డి మాట ఇవ్వడం వల్లనే ఆయనను పార్టీలో చేర్చుకున్నట్టు అధిష్ఠానం వంశీచంద్‌రెడ్డికి చెప్పిందని సమాచారం. రాజ్యసభలో రాష్ట్రం నుంచి ఖాళీ అయ్యే మూడు స్థానాల్లో ఒకటి వంశీచంద్‌కు ఇస్తామని పార్టీ పెద్దలు చెప్పినట్టు తెలిసింది. దీనిపై రేవంత్‌రెడ్డి కూడా హామీ ఇచ్చినట్టు ఆయన సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి.*

### పెరగనున్న 10 లక్షల ఎకరాల ఆయకట్టు: ఉత్తమ్

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): ఈ ఏడాది పూర్తికానున్న సాగునీటి ప్రాజెక్టుల కింద కొత్తగా 10 లక్షల ఎకరాల ఆయకట్టు పెరుగుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. నీటిపారుదల శాఖ బడ్జెట్‌పై మంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించారు.

# వైసీపీ ఎంపీపై రాజ్యసభ చైర్మన్‌కు ఫిర్యాదు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): సభా హక్కుల ఉల్లంఘన కింద వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డిపై ఏపీ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మాణిక్కం ఠాకూర్ మంగళవారం రాజ్యసభ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. విజయసాయిరెడ్డి సోమవారం రాజ్యసభలో తన గురించి అనుచితంగా మాట్లాడారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. లోక్‌సభ సభ్యుడి గురించి రాజ్యసభలో మాట్లాడటం సభాహక్కుల కిందకు వస్తుందని తెలిపారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చింది మోదీ అని, ఆ హామీ గురించి మోదీని ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. పార్లమెంట్‌లో 2019 నుంచి అన్ని బిల్లులు జగన్ మద్దతుతోనే ఆమోదం పొందాయని తెలిపారు. సీబీఐ కేసుల కోసమే బీజేపీకి లొంగిపోయారని ఆరోపించారు.



### 'మహాలక్ష్మి' తెచ్చిన కొట్లాట

*మంగళవారం వేములవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న బస్సులో ఓ ప్రయాణికుడికి సీటు దొరకకపోవడంతో డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగాడు. తనకు సీటు ఇవ్వనిదే బస్సు కదిలేది లేదని పట్టుబట్టాడు. మరో ప్రయాణికుడు జోక్యంతో అది గొడవకు దారి తీసింది. ఇద్దరూ బస్సు దిగి హైవే మీదే తన్నుకున్నారు. పోలీసులు అక్కడికి చేరుకొని గొడవకు పాల్పడ్డవారిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు.* - వేములవాడ రూరల్